క్లుప్తంగా

ఓం ఆకృతిలో దీపాలంకరణ



కాటారం: మండలంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం గారెపల్లిలోని వినాయక మండపం వద్ద మహిళలు ప్రత్యేక దీపాలంకరణలతో స్వామి వారిని కొలిచారు. ఓం, స్వస్తిక్ ఆకృతిలో దీపాలను వెలిగించారు.

కాల్వను సరి చేయాలి



పొలాల్లోకి చేరిన ఓపెన్‌కాస్ట్ నీటిని చూపిస్తున్న రైతులు

మల్హర్: మండలంలోని కాపురం శివారులోని కాల్వను సరి చేయాలని రైతులు లక్ష్మయ్య, మొగిళి, రమేశ్, రవి, చంద్రయ్య అధికారులను కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. అధిక వర్షాలు కురిసిన సమయంలో తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ నీళ్లతో కాల్వ ప్రవాహం పెరిగి కాపురం శివారులోని తమ పంట పొలాల మీదుగా వెళ్తున్నాయని చెప్పారు. దీంతో పొలాలు ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి కాల్వలను సరి చేసి ఓపెన్‌కాస్ట్ నీళ్ల పొలాల మీదుగా వెళ్లకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కి అభినందన



అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: మామునూరు పోలీసు శిక్షణ కళాశాల ఆవరణలో ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 1 వరకు 4వ తెలంగాణ ఎయిర్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపు–7లో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 12మంది ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, ఆటలతో పాటు 100 మీటర్ల పరుగు పోటీలో పలువురు గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయపాల్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి రాజయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారిని పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. భాగ్యశ్రీ, కల్యాణి, అనిల్‌కుమార్, కుమారస్వామి, ప్రవీణ్, రాజు, లలిత, విజయ భాస్కర్, శ్రీకళ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాళేశ్వరం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఎదుట మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన ఇబ్రహీం మెట్‌పల్లి నుంచి స్కూటీపైన వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై కాళేశ్వరం నుంచి మెట్‌పల్లికి కావేరి సురేశ్ వస్తుండగా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల ఎదుట ఎదురెదురుగా బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు వారిని మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బురదరోడ్డుపై నాటేసి నిరసన



బురదరోడ్డుపై నాటు వేస్తున్న గ్రామస్తులు

మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లి రోడ్డు వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో గ్రామస్తులు బురదరోడ్డుపై నాటేసి నిరసన తెలిపారు. ప్రభుత్వాలు మారినా తమ రోడ్ల దుస్థితి మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో హనుమకొండ నుంచి వేములపల్లి మీదుగా బంగ్లాపల్లి వరకు వచ్చే బస్సు రోడ్డు సరిగా లేక నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికై న ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రోడ్డు వేయించాలని కోరుతున్నారు.

కలుపు కష్టాలు..



పత్తి చేనులో పెరిగిన కలుపు మొక్కలు

- వర్షాలతో పత్తి పంటలో పెరిగిన గడ్డి
- ఆందోళనలో రైతులు

రేగొండ: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి పంట ఎదిగే సమయంలో భారీ వర్షాలతో కలుపు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. వారం రోజులకు పైగా వర్షాలు పడుతుండడంతో రైతులు చేనులకు వెళ్లలేదు. ఎలాంటి వ్యవసాయ పనులు సైతం సాగలేదు. ముఖ్యంగా కలుపుతీత పనులు కొనసాగకపోవడంతో పంటల్లో కలుపు విపరీతంగా పెరిగింది. వర్షాలతో కూలీలు కూడా దొరకని పరిస్థితి ఉంది. కూలీల కొరత కారణంగా కూలి రేట్లు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఒక్కొక్క కూలీకి మహిళలకు రూ.300, పురుషులకు రూ.800 తీసుకుంటున్నారు. దీనికి తోడు నల్లరేగడి నేలల్లో నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో పత్తి వేరు కుళ్లి పోయి ఎర్రబడి పత్తి మొక్కలు ఎండిపోతున్నాయి.

మండలంలో ప్రధాన పంట..

ఉమ్మడి రేగొండ మండలంలో ప్రధానంగా పత్తి పంటను 15,230 ఎకరాలలో సాగు చేస్తున్నారు. పత్తి తర్వాత మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. సాగు చేసిన పత్తి అక్టోబర్ నెలలో దిగుబడి ప్రారంభమవుతుంది. పంట చేతికొచ్చే వరకు కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. పత్తి సాగుకు ఒక ఎకరానికి పెట్టుబడి కోసం రైతులు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన కలుపును తొలగించేందుకు ఎకరానికి 8 నుంచి 10 మంది కూలీలు అవసరమవుతున్నారు. విస్తారంగా వర్షాలు కురవడంతో పత్తి పంటకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పంట చేలల్లో నీరు నిల్వ ఉండటంతో పంటకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మండలంలో వారం రోజులుగా కురిసిన వర్షాలతో పత్తి పంటలో కలుపు విపరీతంగా పెరిగింది. కూలీల కొరత కారణంగా ఇబ్బంది పడుతున్నాం. కూలీల ఖర్చు కూడా పెరిగింది. అరకతో పనులు సాగడం లేదు. కూలీలకు రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఖర్చు అవుతుంది.

– అప్పని కట్టస్వామి, రైతు, కొత్తపల్లిగోరి

జాగ్రత్తలు పాటించాలి



రైతులు పంటలను కాపాడుకోవడానికి తగు జాగ్రత్తలు పాటించాలి. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కలుపు తీసే అవకాశం లేక పిచ్చిగడ్డి మొక్కలు ఏపుగా పెరిగాయి. కూలీల కొరతతో కలుపు నివారణకు క్విజాలోఫోఫ్ ఈథైల్ మందును పిచికారీ చేయాలి.

– పెద్ది వాసుదేవరెడ్డి, ఏఓ, రేగొండ

సంక్షేమ సారథి వైఎస్సార్



నివాళులర్పిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

రేగొండ: పేదల సంక్షేమ సారథి మహానేత వైఎస్సార్ అని యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతిని యూత్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిర్వహించారు. ఆయ న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి మహానీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లిగోరి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లెబోయిన తిరుపతి, నాయకులు రాంబాబు, యాకుబాబు, యుగేందర్ పాల్గొన్నారు.

వరి, పత్తి పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లి, ఆశిరెడ్డిపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి కల్యాణితో కలిసి తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం మంగళవారం వరి, పత్తి పంటలను పరిశీలించింది. ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా మినికిట్స్ డబ్ల్యూజీఎల్–962 రకం వరి విత్తనాలను గతంలో సరఫరా చేశారు. కాగా ఆ వరి పంటలతో పాటు పత్తి పంటను శాస్త్రవేత్తలు పరిశీలించి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ.. వారి పంటలో కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరాకు 8 కిలోలు, లేదా కొరాజిన్ పిచికారీ చేయాలన్నారు. అలాగే పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణకు వేపనూనే పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పంటలలో ప్రతికూల పరిస్థితులు కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సస్య రక్షణ పద్ధతులను అవలంభించి వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకోవాలని కోరారు. వారి వెంట ఏఈఓలు రాహుల్, అరుణ్, భరత్, రైతులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- వైద్యాధికారి నాగరాణి



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న నాగరాణి

మొగుళ్లపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారిని నాగరాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ.. వర్షాలు అధికంగా పడడంతో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వచ్చే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా జ్వరాలు వచ్చినట్లయితే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. పాఠశాలలో వంట గదిని, సామగ్రి గదిని, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం,ఆశాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను గోస పెడుతున్న ప్రభుత్వాలు

- సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మల్లేశ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాటారం: రైతులకు సరిపడా యూరియా అందించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని అరిగోస పెడుతున్నాయని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేశ్, యువైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. రోజంతా క్యూలో నిలబడి పడిగాపులు కాసిన రైతుకు ఒక్క యూరియా బస్తా దొరికే పరిస్థితి లేదని వాపోయారు. కాటారం మండలంలోని ప్రైవేటు ఎరువుల డీలర్లు యూరియాను నిల్వ ఉంచుకొని మరో ఎరువు కొంటే యూరియా ఇస్తామని లింకు పెట్టి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బాబురెడ్డి, బుర్రి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

కాటారం(మహాముత్తారం): ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని మహాముత్తారం బీజేపీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో దొబ్బలపాడ్ మోడల్ స్కూల్ ఎదుట కాటారం–మేడారం ప్రధాన రహదారిపై నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ మాట్లాడుతూ.. మండలంలోని పేద విద్యార్థుల కష్టాలు గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు, ప్రస్తుతం అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. 10 సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విద్యార్థుల కష్టాలు పట్టించుకోలేదన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి 40 ఏళ్లుగా పదవులు అనుభవిస్తున్న దుద్దిళ్ల కుటుంబం మండలంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి ఏం చేయలేదని అన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నా విరమింపజేశారు. రాజు, డాక్టర్ రఫీ, నవీన్‌నాయక్, మహేశ్, శేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న పవన్‌శర్మ, నిర్వాహకులు



టేకుమట్లలో..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని పెంటివాడ వినాయక మండపం వద్ద కాంగ్రెస్‌పార్టీ యూత్ నాయకుడు మాడుగుల పవన్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యదర్శి సత్యనారాయణ, ఎన్పీడీసీఎల్ లైన్ ఇన్‌స్పెక్టర్ సదానందం, నాయకులు మెంగాని అశోక్, శకిల్, బాబా, మధు, రాజబాపు, రవి ఉన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగుతున్న గణపతి నవ రాత్రోత్సవాల సందర్భంగా గణపతి మండలపాల వద్ద కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా ప్రదర్శన

కాటారం: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని 24 గ్రామపంచాయతీలకు సంబంధించిన ఓటరు తుది జాబితాను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అద్దూరి బాబు విడుదల చేశారు. వార్డుల వారిగా తుది ఓటరు జాబితా ప్రచురించినట్లు ఎంపీడీఓ తెలిపారు. మండలంలో 210 వార్డులు ఉండగా మొత్తం 30785 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 14883, స్త్రీ ఓటర్లు 15894, ఇతరులు 8 ఓట్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరస్వామి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛ, హరిత విద్యాలయ ర్యాంకింగ్‌పై అవగాహన

మొగుళ్లపల్లి: స్వచ్ఛ, హరిత విద్యాలయ ర్యాంకింగ్‌పై మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను శుభ్రంగా, విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం, హరిత పాఠశాలలుగా తయారు చేయలన్నారు. ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి, ఆర్పీలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకు సౌకర్యాల కల్పన

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ



చిట్యాల: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, ఖాళీగా ఉన్న సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆస్పత్రిలో సౌకర్యాల కల్పన, సిబ్బంది నియామకం, మెరుగైన వైద్య సేవలకు అధునాతన పరికరాలు ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ.. 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే సీటీ స్కాన్ మిషన్‌ను ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటేశ్వర్లు, వైద్యులు పాల్గొన్నారు.

'నానో'పై అవగాహన కల్పించాలి

పంటలకు నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని తన చాంబర్‌లో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, ఫెర్టిలైజర్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నానో యూరియా వాడకం వలన రైతులకు దిగుబడితో పాటు లాభం చేకూరుతుందన్నారు. ఈ సమావేశంలో డీఏఓ బాబురావు, అధికారులు, యజమానులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు పంపాలి

ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పనులు, పంటల ప్రతిపాదనలు ఇవ్వాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, వైద్య, విద్యా, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విపత్తు సమయంలో తక్షణ సహాయ చర్యలు, పునరావాస కార్యక్రమాలపై ప్రణాళికాబద్ధంగా పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చిట్యాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, హాస్టల్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే వసతి గృహంలోని గదులను, వంట గదిని పరిశీలించారు.

పరామర్శ

మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన మేరుగు భావనరుషి, జాలిగపు సమ్మయ్య, ఓరుగంటి రవి, మండల కేంద్రానికి బుర్ర రాజయ్య, పిట్టల ఆగయ్య, నైన్‌పాక గ్రామానికి చెందిన కట్టికోళ్ల లక్ష్మి, గౌడుగు అయిలుమల్లు, రాయరాకుల సమ్మక్క పలు కారణాలతో ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. అలాగే చల్లగరిగ గ్రామానికి చెందిన కటిక మధు, మండల కేంద్రానికి చెందిన ఆరెపల్లి మల్లయ్యలకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలు కావడంతో వారిని పరామర్శించారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, గడ్డం కొమురయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, బుర్ర లక్ష్మన్ పాల్గొన్నారు.

రేగొండ: మండలంలోని కనిపర్తి గ్రామానికి చెందిన ఐలయ్య, చిలుపాక సారమ్మ ఇటీవల మృతిచెదారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. నాయకులు కిష్టయ్య, పున్నం రవి ఉన్నారు.

యూరియాను అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న రవి పటేల్

భూపాలపల్లి రూరల్: జిల్లా వ్యాప్తంగా ఎరువుల కొరత కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియాను పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలని తీన్మార్ మల్లన్న బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా ఇన్‌చార్జ్ రవి పటేల్ డిమాండ్ చేశారు. మంగళవారం జంగేడు పీఏసీఎస్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. రైతులు పంటలు వేసుకొని ఎరువుల కోసం పడిగాపులు గాస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వెంటనే యూరియా, ఇతర ఎరువులు సకాలంలో అందించాలని కోరారు.

వర్షానికి కూలిన ఇల్లు

మల్హర్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని ఎడ్లపల్లి ఎస్సీకాలనీకి చెందిన మంథని లక్ష్మి ఇల్లు పాక్షికంగా కూలింది. బాధితురాలు లక్ష్మి తెలిపిన వివారల ప్రకారం.. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇంటి గోడలు తడిసిపోవడంతో మంగళవారం గోడలు కూలిపోయాయని తెలిపారు. దీంతో ఇంట్లో సామగ్రి నేల మట్టమైందని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా ఆదుకోని న్యాయం చేయాలని కోరారు.

మోనూ ప్రకారం భోజనం అందించాలి

- మండల ప్రత్యేకాధికారి మానస



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

మొగుళ్లపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, వసతిగృహాల్లో విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి మానస అన్నారు. మంగళవారం మండలంలోని కోర్కిశాలలోని మోడల్‌స్కూల్, కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకోనిరావాలన్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఎంపీడీఓ సురేందర్, హాస్టల్ ఇన్‌చార్జ్ భాస్కర్ ఉన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

మల్హర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తాడిచర్ల సెంటర్‌లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో రాఘవరెడ్డి సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉందని, ఇప్పుడు యూరియా కోసం రైతులు అల్లాడుతున్న కనీసం పట్టించుకునే నాథుడే లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు జాగిరి హరీశ్, మాజీ పీఏసీఎస్ చెర్మన్ చెప్యాల రామారావు, మాజీ ఎంపీటీసీ రావుల కల్పన మొగిళి, మాజీ కో ఆప్షన్ మెంబర్ అయ్యూబ్‌ఖాన్, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేరే భవనంలోకి తరలించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలను వేరే భవనంలోకి తరలించాలని బీఆర్ఎస్వీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ రాహుల్ శర్మకు బీఆర్ఎస్వీ నాయకులు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. మైనారిటీ గురుకులాన్ని రాజకీయ ప్రలోభంతో ఎలాంటి సౌకర్యాలు లేని పాత కలెక్టరేట్ కార్యాలయానికి తరలించడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. భవనం చుట్టూ చెట్ల పొదలు ఉండడం వలన విష పురుగులు వస్తున్నట్లు వివరించారు. సరైన గదులు, మరుగుదొడ్లు లేవన్నారు. వెంటనే నూతన భవన నిర్మాణం చేపట్టాలని అప్పటి వరకు మరొక భవనంలోకి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, శ్రీకాంత్, మనోహర్, దేవేందర్, ప్రశాంత్, రాకేష్, కుమార్ పాల్గొన్నారు.